# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 22 మే, 2024 | పేజీలు : 04


## నందన డిగ్రీ కాలేజ్‌లో జోరుగా మాస్ కాపీయింగ్ దందా



మిగతా 2 లో.

# మాసాంతంలోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియను మాసాంతం లోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, కార్మికశాఖ అధికారి కృష్ణఆదిత్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్లు బదావత్ సంతోష్, వెంకటేష్ ధోత్రే, మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, దాసరి వేణు లతో కలిసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం నీడ, త్రాగునీరు ఇతర సదుపాయాలు కల్పించడంతో పాటు ఓ. ఆర్.ఎస్., మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. తూకము చేయడానికి వినియోగించే కాంటా, బాట్లు, తేమ శాతాన్ని పరిశీలించే మాయిశ్చర్ మీటర్, గన్నీ సంచులు సమకూర్చాలని, అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించుకోవడానికి అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం తూకం చేయడానికి ముందే సంబంధిత రైతు వద్ద నుండి కూపన్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతులను తీసుకోవాలని, ఇట్టి వివరాలను ట్యాబ్లలో నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసిన రశీదు జారీ చేయాలని తెలిపారు. ఆయా కేంద్రాల పరిధిలో మిగిలి ఉన్న రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని అవసరం మేరకు 15 నుండి 20 టార్పాలిన్లు అందించాలని, కొనుగోలు వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, జిల్లా అదనపు కలెక్టర్లు





(రెవెన్యూ), రాజస్వ మండల అధికారులు, ప్రత్యేక అధికారులు, తహాశిల్దార్లు తమ పరిధిలోని కనీసం 2,3 కొనుగోలు కేంద్రాలను సందర్శించి వివరాలతో నివేదిక అందించాలని, కొనుగోలు కేంద్రానికి కేటాయించిన లక్ష్యం 100 శాతం పూర్తయినట్లయితే వివరాలు సమర్పించి ఆ కేంద్రాన్ని మూసివేయాలని, ఆ కేంద్రాలలో మిగిలిన సామాగ్రి అవసరం ఉన్న కేంద్రాలను తరలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా తరలించాలని, అవసరమైన లారీలను సమకూర్చాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సంబంధించి దినపత్రికలలో ప్రచురించబడే ప్రతికూల వార్తలకు పూర్తి వివరాలతో సరైన వివరణ అందించాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన కొనుగోలు కేంద్రాలను బ్లాక్ లిస్టులో నమోదు చేసి సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 136, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 89, మెప్మా ఆధ్వర్యంలో 10, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో 51 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో 68 కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి ఆయా కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. 99 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి 76 శాతం ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన వివరాలను 10 రోజులలో పూర్తి చేసే విధంగా జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం తరలింపులో లారీల యజమానులు, గుత్తేదారుల సమన్వయంతో ప్రక్రియ వేగవంతంగా జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని, ధాన్యం ఎగుమతి, దిగుమతి అంశాలలో ఆలస్యం లేకుండా చూసుకోవడంతో పాటు అవసరమైన హమాలీలను సమకూర్చుకోవాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించేందుకు మండలాల వారిగా అధికారులను నియమించడం జరిగిందని, కొనుగోలు వివరాలను ప్రతి రోజు ట్యాబ్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని, రైతులు కల్లాలలో ధాన్యాన్ని ఆరబెట్టి తప్ప, తాలు, మట్టిగడ్డలు లేకుండా నిబంధనల ప్రకారం తేమ శాతాన్ని పరిశీలించుకొని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, కుమ్రంభీం అసిఫాబాద్ జిల్లాల రాజస్వ మండల అధికారులు, జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, తహాశిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చెరువునుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం జల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామంలోని ఎద్దికుంట చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నTS 12T1716 నెంబర్ గలటాక్టర్ను రామగిరి మండలరెవెన్యూ ఇన్స్పెక్టర్ నిహారిక మంగళవారం మట్టి ట్రాక్టర్ పట్టుకొని టూటౌన్ పోలీస్ స్టేషన్ తరలించారు. గ్రామానికి చెందిన కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో జెసిపి సాయంతో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరిస్తున్నవిషయంతెలుసుకొని రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకోగా అప్పటికే జెసిబి మిగతా ట్రాక్టర్లు రెవెన్యూ అధికారులను గమనించి అక్కడినుంచి వెళ్ళిపోగా ఒక ట్రాక్టర్ పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్ తరలించడం జరిగింది.





## విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు కొరత లేదు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఖరీఫ్ సీజన్ సాగు కోసం జిల్లాలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు కొరత లేదని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ సాగు పై వ్యవసాయ అధికారులు, పోలీసులు, డీలర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో వరి 1,82,000 ఎకరాలు, 50 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రైతులకు ఎరువులు దుకాణాల డీలర్లు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి డీలర్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని, తమ దుకాణంలోని స్టాక్ వివరాలు బోర్డు పై ప్రదర్శించాలని, వాటి వివరాలు ఆన్లైన్ లో ఎంట్రీ చేయాలని సూచించారు. గడువు ముగిసిన ఎరువులు, విత్తనాలు, పురుగు



మందులు అమ్మవద్దని పేర్కొన్నారు. ప్రతి అమ్మకానికి సంబంధించి రసీదు రైతులకు అందజేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు కూడా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. రైతులు డీఏపీ వాడాలని పిలుపు నిచ్చారు. నకిలీ విత్తనాలు ఎక్కడైనా విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. పోలీసులు, వ్యవసాయ అధికారులు, దుకాణాల డీలర్లు కలిసి వీటిని అరికట్టాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు బాగుంటేనే అందరం బాగుంటామని వివరించారు. అనంతరం డీలర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# విద్యుత్తు లైన్లను తనిఖీ చేసిన సిజిఎం

**ప్రజాపక్షం/శంకరపట్నం :** మండల పరిధిలోని వంకాయ గూడెం, ముత్తారం గ్రామాలలో మంగళవారం ఎన్‌పిడిసిఎల్ సిజిఎం ప్రాజెక్టు, కరీంనగర్ నోడల్ అధికారి రాజు చౌహాన్ 11 కెవి విద్యుత్ ఫీడర్లను తనిఖీ నిర్వహించి మొలంగూర్ ఎక్స్‌రోడ్ సమీపంలో ఉన్న బిఎస్ఆర్ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. రాబోయే వర్షాకాలం లోపు 33 కెవి , 11 కెవి లైన్ మరమ్మత్తు పనులను వేగవంతంగా పూర్తి చేపట్టాలన్నారు. విద్యుత్‌కు అంతరాయం కలిగించే విద్యుత్‌తీగలకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎస్‌ఈ వి.గంగాధర్, హుజురాబాద్ డీఈ లక్ష్మా రెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, తాడికల్ ఏఈ సంపత్ రెడ్డి, ఆముదాల పల్లి ఏఈ కుమారస్వామి, విద్యుత్ సిబ్బంది తదితరులున్నారు.

# రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/గంగాధర :** ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందంటూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వ్యాఖ్యానించారు. దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వకుండా సన్న వడ్లకు ఇస్తానని రైతులను దగాచేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఘరానా మోసం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరో మాట అంటూ మండిపడ్డారు. రైతుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందన్నారు. నిరుద్యోగులకు నెలకు నాలుగు వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి తాము అలా చెప్పలేదంటూ అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు బోనస్ విషయంలో రైతులను దారుణంగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తున్నారని పేర్కొన్నారు. అబద్దాలతో అందలమెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వారి నిజస్వరూపం బయటపెట్టిందన్నారు. ఆరుగాలం కష్టపడ్డ రైతులను మరోసారి నట్టేట ముంచిందన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ది చెప్పాలన్నారు.

# పత్తిపంటపై రైతు సమృద్ధి అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** రాశి సీడ్స్‌వారి పత్తి పంటపై రైతు సమృద్ధి అవగాహన సదస్సు ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో నిర్వహించారు. కంపెనీ రీజినల్ మేనేజర్ ప్రదీప్ కుమార్, టిఎస్ఎం రమణారెడ్డిలు మాట్లాడుతూ పత్తిపంటను ఆశించే చీడపీడలు తెగుళ్లపై అవగాహన కల్పించారు. కొత్తరకమైన రాశి స్విఫ్ట్ హైబ్రిడ్‌ను రైతుల సమక్షంలో ఆవిష్కరించారు. గత సంవత్సరం రాశి స్విఫ్ట్ పండించి అధిక దిగుబడులు పొందిన రైతులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. రైతులు వంగ రామకృష్ణ, చిన్నతల ఐలయ్య, నేతాజీ, సురేందర్, నరేష్‌లు మాట్లాడుతూ ఈ రకం రసం పీల్చే పురుగులను తట్టుకుని పత్తి ఏరడానికి సులువుగా ఉందని, పెట్టుబడి ఖర్చు బాగా తగ్గిందని, ఎకరానికి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని పేర్కొన్నారు. కంపెనీ సిబ్బంది కోట శ్రీను, గడ్డి శ్రీను, హరీష్, రాజశేఖర్, శ్యామ్ తదితరులున్నారు.

# నందన డిగ్రీ కాలేజ్‌లో జోరుగా మాస్ కాపీయింగ్ దందా

## నందన డిగ్రీ కళాశాల పైన క్రిమినల్ కేసు నమోదు చేసి ఐదు లక్షల జరిమానా విధించాలి

## నష్టపోయిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలి




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి నందన డిగ్రీ కళాశాలలో కాకతీయ యూనివర్సిటీ సెమిస్టర్ ఎగ్జామ్ నడుస్తున్నాయి.నందన డిగ్రీ కళాశాల యజమాన్యం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ మాస్ కాపీయింగ్ నిర్వహిస్తున్నరని ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా డబ్బులు ఇవ్వకపోతే ఎగ్జామ రాయనివ్వకుండా తిరిగి పంపిస్తున్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నందన డిగ్రీ కళాశాల పైనా క్రిమినల్ కేసు నమోదు చేసి ఐదు లక్షల జరిమానా విధించాలని కోరడం జరుగుతుంది.బడుగు బలహీన పేద విద్యార్థులు ఎగ్జామ్ ఫీస్ కట్టడానికే స్థితి ఉండదు కింద మీద పడి సెమిస్టర్ ఎగ్జామ్ ఫీస్ కడితే నందన డిగ్రీ కళాశాలలో సెంటర్ పడంగానే భయపడుతున్నారు కళాశాలకు వేలల్లో డబ్బులు ఎలా ఇవ్వాలి అంటూ చాలామంది విద్యార్థులు ఎగ్జామ్ రాయడం లేదు,నందన డిగ్రీ కళాశాల దందా కు విద్యార్థులు భయ బ్రాంతులకు గురి అవుతున్నారు. కాలజీ దందా వల్ల చాలామంది విద్యార్థులు నష్టపోతున్నారు.ఈ అంశం పైన కాకతీయ యూనివర్సిటీ విసీ,జిల్లా కలెక్టర్,స్పందించి సమగ్ర విచారణ జరిపి కళాశాల పైన క్రిమినల్ కేసు నమోదు చేసి ఐదు లక్షల జరిమానా విధించాలని అలాగే నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.లేని పక్షంలో పోరాటలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

# గీత కార్మికులకు వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** గీతవృత్తిలో భాగంగా ఈ నెల 16న గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య గౌడ్ సాయంత్రం వేళ తాటిచెట్టుపైనుంచి కాలు జారి కింద పడడంతో గాయాల పాలయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రికలో చికిత్స పొందుతున్న అంజయ్యను సర్దార్ సర్వాయిపాపన్న గీతకార్మిక సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. ఈ సంధర్భంగా శంకర్ మాట్లడుతూ జిల్లాలో కులవృత్తి చేసుకునే కార్మికులు ఈ మద్యకాలంలో గాయాలపాలై మరణిస్తున్నారని, వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, వీరికి చెందాల్సిన ఎక్స్‌గ్రేషియా గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో పెట్టారని, వెంటనే ఆ ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేవారు. అంజయ్య ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వ డాక్టర్లను అడిగి వివాలు తెలుసుకోవడం జరిగిందని అంజయ్య వెన్నుపూస బాగం విరిగిందని డాక్టర్లు తెలిపారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇతనికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇతనికి కూతురు, కొడుకు ఉన్నారని, ఇతడు పనిచేస్తేనే కుటుంబం గడిచేదని, చెట్టు పై నుంచి పడడంతో వారి కుటుంబం రోడ్డు పాలు అయ్యిందని వెంటనే ప్రభ్వుత్వం వీరికి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. అబ్కారీ శాఖ అధికారులు వెంటనే జరిగిన సంఘటనపై విచారణ జరిపి వారి కుటుంబాన్ని ఆదుకొనుటకు చర్యలు తీసుకోవాలని వారిని కోరారు.

# 3 నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జులై 3 నుంచి జులై 12 వరకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) రిక్రూట్‌మెంట్ ర్యాలీ 3 ఎఎస్‌సి ఎయిర్‌ఫోర్స్ సంస్థ కాన్పూర్, 7 ఎస్‌సి, 1 కబ్బన్ రోడ్, బెంగుళూరు (కర్ణాటక)లలో పాల్గొనడానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెళ్లికాని భారతీయ పురుషులు, ఆడవారి కోసం అగ్నివీర్వాయుడు (సంగీతకారుడు) కోసం రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహిస్తోందన్నారు. దీనికి సంబంధించిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ 3 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, కాన్పూర్, 7 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ బెంగుళూరులో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ద్వారా అగ్నివీర్ వాయు (మ్యుజియన్) ఇంటెక్ రిక్రూట్‌మెంట్ కోసం జాబ్ నోటిఫికేషన్ జారీ చేయబడిందన్నారు. అగ్నిపథ్ పథకం ప్రవేశంతో క్లరికల్/టెక్నికల్ కేడర్‌లో ఉద్యోగ అవకాశం ఇప్పుడు 4 సంవత్సరాల సర్వీసుకు పరిమితం చేయబడుతుందని, అభ్యర్థులలో 25 శాతం మందికి శాశ్వత ప్రవేశం కల్పించబడుతుందని అన్నారు. అభ్యర్థి అవివాహితులై 02 జనవరి 2024 నుంచి 02 జులై 2007 (రెండు తేదీలు కలుపుకుని) మద్య జన్మించి ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో మెట్రిక్యులేషన్/ 10వ తరగతి ఉత్తీర్ణత లేదా సమాన విద్య కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు టెంపో, పిచ్, ఒక పూర్తి పాఠ పాడడంలో ఖచ్చితత్వంతో సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండలని, వారు ఒక ప్రిపరేటరీ ట్యూన్ ప్రదర్శించగలగాలని తెలిపారు.

ఆసక్తి అర్హత గల అభ్యర్థులు 22 మే, 2024 ఉదయం 11 గంటల నుంచి 05 జూన్ రాత్రి 11 గంటల వరకు వెబ్ పోర్టల్‌లో రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలి



**ప్రజాపక్షం/గంగాధర :** రైతులకు ఇచ్చిన హామీల మేరకు రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందంటూ నిరసనగా గంగాధర మండలం మధురానగర్‌లోని బిజెపి కార్యాలయంలో ఆ పార్టీ చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్ ఆద్వర్యంలో రైతన్న కోసం బిజెపి రణభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రైతులకు రెండు లక్షల రుణమాఫీ, క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని, ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే రూ.500 ఇస్తామని రైతులను మరోసారి మోసం చేయాలని చూస్తుందని దుయ్యబట్టారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీ నారాయణ, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు బింగివేణు, జిల్లా కార్యదర్శి ఉప్పు రామకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు కోల అశోక్, సుదర్శన్ రెడ్డి, రేగులపాటి రవీందర్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మామిడి చైతన్య, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవల్లి శశిధర్ రెడ్డి తదితరులున్నారు.

# మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ నెహ్రూ కుటుంబం త్యాగాల కుటుంబమని, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత, పలు గ్రామాల శాఖ అధ్యక్షుడు మల్లిఖార్జున్ రెడ్డి, చింతపూల నరేందర్, లక్ష్మ ణ్, వంగ కనకయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, కిసాన్ సెల్ అధ్యక్షుడు కాంతాల మహిపాల్ రెడ్డి, నాయకులు పోటు మల్లారెడ్డి, సాంబార్ బాబు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# మాలధారణతో చెడు వ్యసనాలు దూరం



**ప్రజాపక్షం/జమ్మికుంట :** హనుమాన్ మాలధారణతో చెడు వ్యసనాలు దూరం అవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల ప్రసాద చార్యులు అన్నారు. మంగళవారం పట్టణంలోని మారుతినగర్‌లో గల శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఏకాదశ దివస మాల ధారణ కార్యక్రమం నిర్వహించారు. సుమారు మూడు వందల మంది స్వాములు హనుమాన్ మాల స్వీకరించారు. ఈ సంధర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల ప్రసాదచార్యులు మాట్లాడుతూ హనుమాల మాలధారణ వేసుకోవడం వల్ల చెడు వ్యసనాలు దూరమై సన్మార్గంలో పయనించే వీలుంటుందని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆద్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు భాచీ, కమిటీ సభ్యులు అయిలన్న, రాజేందర్, మహేందర్, లక్ష్మ న్ , సంపత్ తదితరులున్నారు.

# సన్నాలకే రూ.500 బోనస్ ఇస్తామనడం మంచి నిర్ణయం




**ప్రజాపక్షం/జమ్మికుంట :** సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామనడం మంచి నిర్ణయమని యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మహమ్మద్ సజ్జద్ పేర్కొన్నారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ సన్న వడ్లకు పెట్టుబడి ఎక్కువగా ఉండి దిగుబడి తక్కువగా ఉంటుంది కనుక వారికి ఇవ్వడమే ఉత్తమమని పేర్కొన్నారు. సన్న వడ్లు పండించేలా రైతులను ప్రోత్సహించడం ద్వారా జనాలందరికీ రేషన్ బియ్యం ద్వారా సన్న బియ్యం ఇవ్వొచ్చని, ప్రభుత్వ హాస్టల్స్‌లో చదువుకునే విధ్యార్థులకు మంచి నాణ్యమైన బోజనం పెట్టవచ్చని తెలిపారు. పట్టణాల్లో క్వింటాలు సన్నబియ్యం ధర ప్రస్తుతం చుక్కలనంటుతోందని, లాభాలకు ఆశపడి దొడ్లు వడ్లు పండించి ఇతరులకు అమ్మేకంటే సన్నవడ్లు పండించి జనాలందరూ కడుపు నిండా బోజనం చేసేలా ఉంటుందన్నారు. పట్టణాల్లో నివసించే మద్యతరగతి వారికి సన్న బియ్యం ధర తగ్గుతుందని తెలిపారు.

# విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణానికి చెందిన ఆదాబ్ హైదరాబాద్ విలేఖరి అంగల తిరుపతి పై దాడి చేసిన అక్రమ మైనింగ్ నిర్వాహకుడు ఖలీమ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాగజ్ నగర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్ డిఎస్‌పి కరుణాకర్, ఆర్‌డిఒ సురేష్ లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయం లో సమగ్ర విచారణ జరిపి బాద్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని డిఎస్‌పి కరుణాకర్ హామీ ఇచ్చారు. ఆర్‌డిఒ సురేష్ మాట్లాడుతూ దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఆదేశిస్తానని, అక్రమ మైనింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు వేగ వంతం చేయండి

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలంలోని గడ్చందా నగర్ గ్రామాల లోని వరి కొనుగోలు కేంద్రాలను నిర్మల్ జిల్లా అడిషనల్ రెవెన్యూ కలెక్టర్ కిషోర్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా రెవెన్యూ కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రల లోని వరి ధాన్యాన్ని తరలించాలని,వేగవంతం చేయాలని వర్షాలు పడే అవకాశం ఉందని సెంటర్లలోని యాజమాన్యాలకు పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మొతిరాం, ఆర్.ఐ బాలకిషన్, సిఇఓ చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించిన సిఇఓ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండల కేంద్రంలోని నర్సరీలను అమ్మ ఆదర్శ పాఠశాలను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని రికార్డులను సీఈవో గోవింద నాయక్ పరిశీలించారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో మరమ్మతులు నిర్మించడంతో మరమ్మత్తుల యొక్క పనులను పరిశీలించడం జరిగిందని నర్సరీలలోని మొక్కలు మండల వ్యాప్తంగా హరితహారం కార్యక్రమానికి నర్సరీల లోని మొక్కలు అందేలా చూడాలని,రికార్డులను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సోలామన్ రాజ్,సీనియర్ అసిస్టెంట్ భూమరావు రమేష్ పాల్గొన్నారు.

# ఆర్ఎంపిలు ప్రభుత్వ గీత దాటవద్దు



**ప్రజాపక్షం/బైంసా :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్సలు నిర్వహిలస్తున్న ఆర్ఎంపీ,పీఎంపీలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించవద్దని నిర్మల్ జిల్లా ఆర్ఎంపి,పి.ఎంపి అసోసియేషన్ కార్యదర్శి అమ్ముల సాగర్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడురు.ఏ ఒక్క ఆర్ఎంపి ప్రభుత్వ గీత దాటావద్దని హెచ్చరించారు.ఆర్ఎంపీలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకునేందుకు తామే ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి...



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** దేశాన్ని సాంకేతిక విద్యవైజ్ఞానిక రంగాలలో ముందుకు తీసుకెళ్లిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్ గాంధేనని పలువురు నాయకులు పేర్కొన్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాజీవ్ గాంధీ ప్రత్యేక కృషి ఫలితంగానే దేశం ఈ రోజు సాంకేతిక,విద్య,వైజ్ఞానిక రంగాలలో వేగంగా ముందుకు దూసుకెళ్లున్నదని గుర్తు చేశారు.దేశ స్వాతంత్రం కోసం దేశ అభివృద్ధి కోసం తమదైన రీతిలో రాజీవ్ గాంధీ కుటుంబ సభ్యులు త్యాగాలు చేయడం జరిగిందన్న విషయాన్ని సమాజం గుర్తించాలన్నారు.యువతకు సముచిత ప్రాధాన్యతనిస్తూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువ మొత్తంలో కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీ ఇదేనని చెప్పారు.రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండి ఆయన పాలన కాలాన్ని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్,నిర్మల్ జిల్లా జడ్పీటీసీల ఫోరం అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సయ్యద్ అర్జుమంద్, కాంగ్రెస్ పార్టీ నిర్మల్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, కొట్టే శేఖర్, నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు అల్లూరి మల్లారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంబడి రాకేష్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఖానాపూర్‌లో...

ఖానాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో,భరత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చెర్మన్ రాజుర సత్యం మాట్లాడుతూ ఆధునిక భారత దేశానికి పునాదులు వేసి అణగారిన బతుకులు వెలుగులు నింపి,తన జీవితం ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బ్రతికి,దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానేత ప్రధాని రాజీవ్ గాంధీ అని కొనియాడారు.ఆయన ఆశయాల మేరకు నడుచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మైనారిటీ సెల్ అధ్యక్షులు షౌకత్ పాషా, మాజీ మర్కెట్ చైర్మన్ గంగా నరసయ్య, మాజీ సర్పంచ్ నేరెళ్ల సత్యనారాయణ, నాయకులు, తదితరులు ఉన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రంలో బిఆర్ఎస్ ఆందోళన

**ప్రజాపక్షం/దిలావర్పూర్ :** మండలంలో మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా సమన్వయకర్త కొరపల్లి రాంకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో దిలావర్‌పూర్ లో దొడ్డు వడ్లకు కూడా రూ.500 రూపాయలు బొనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు.వడ్ల కళ్ళలా వద్ద రైతులు,బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సమన్వయకర్త రాంకిషన్ రెడ్డి,నిర్మల్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాములు మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని అధోగతి పాలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు.రైతన్నలకు ఇచ్చిన హామీలనుంటిని పక్కన అమలు చేయాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలను చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.ఎన్నికల అప్పుడు ఒక మాట..ఎన్నికల అయిన తర్వాత ఒక మాటతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలను



మభ్యపెట్టి రీతిలో ముందుకు వెళ్తున్నారని విమర్శించారు.మరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస మౌలిక వసతులు లేక రైతులు నిత్యం పడరాన్ని పాట్లు పడుతున్నారని పేర్కొన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేశారు.జోక్యం చేసుకొని ఆందోళనకారులను శాంతింప చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మారుగొండ రాము,జడ్పీ కోఆప్షన్ సభ్యులు డా.యు.సుభాష్ రావు,చిన్న రెడ్డి,మహమ్మద్ నసీరొద్ధిన్,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌జిటి తీర్పు హర్షణీయం : తుమ్మేటి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై అధికారులు, నాయకులు ఒక్కొక్కరుగా మూల్యం చెలించుకోవాల్సిన సమయం వచ్చిందని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి పేర్కొన్నారు. మానేరు నదిలో ఇసుక తవ్వకాలు చట్ట విరుద్ధమని నేడు ఎన్జీటి తీర్పులో పేర్కొనడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వం ఇసుక మాఫియాతో కుమ్మక్కై వేల కోట్ల రూపాయల అక్రమార్కులకు పాల్పడిందని ఆయన పేర్కొన్నారు. డీసిల్టేషన్ పేరుతో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా తాను రైతాంగం పక్షాన ఉద్యమించానని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం అండదండలతో మానేరులో ఇసుక విధ్వంసానికి పాల్పడుతూ కాంట్రాక్టర్లు వేల కోట్ల అక్రమార్చకు పాల్పడి తీర ప్రాంత రైతాంగ ఉపాధులను దారుణంగా దెబ్బతీశారని వాపోయారు. ఇసుక కాంట్రాక్టర్ల వేల కోట్ల అక్రమార్జనలను తాను సాక్ష్యాలతో సీఎంకు అందజేశానని, విచారణ జరుగుతున్నదని తెలిపారు. ఎన్జీటీ ఇచ్చిన తీర్పు గత ప్రభుత్వానికి చెంప పెట్టనని తెలిపారు.

ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారులపై గత ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విన్నించారు. మొక్కవోని ధైర్యంతో న్యాయపోరాటాన్ని కొనసాగించి విజయం సాధించిన మానేరు పరిరక్షణ సమితి నాయకులు సంధి సురేందర్ రెడ్డి, చిటికేసి సతీష్ కుమార్‌లను ఆయన అభినందించారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** 2024/25 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూళ్ళలో ప్రవేశం కొరకు 3, 5, 8 తరగతుల అర్హతగల గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుండి వచ్చేనెల 06 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో అర్హులైన వారిని జూన్ 12న లాటరీ పద్ధతి ద్వారా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నందు ఎంపికచేస్తున్నట్లు చెప్పారు. వీటిలో 3 సీట్లు పివిటిజి తెగకు, 3 సీట్లు ఏజెన్సీ గ్రామాలకు చెందిన విద్యార్థులకు, 27 సీట్లు అన్ని గిరిజన తెగల విద్యార్థులకు రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

ఈ పాఠశాలల్లో ప్రవేశం కొరకు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ స్థాయిలో రూ. లక్షా 50 వేలు, పట్టణ స్థాయిలో రూ.2 లక్షలు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అన్ని ధృవీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేసి కలెక్టరేట్ లోని గిరిజన శాఖ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

# ఆర్నకొండ గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ

**ప్రజాపక్షం/చొప్పదండి :** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలోని ఆర్నకొండ గ్రామ పంచాయతీ రికార్డులను కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సిసిఆర్), పౌర మానవ హక్కుల జాతీయ సంస్థ మంగళవారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో నిర్వహించాల్సిన పనులు అధికారులు పూర్థిస్థాయిలో నిర్వహించలేదని, ఉన్న రికార్డు పూర్తి తప్పుడు తడకగా నిర్వహించినట్లు సిసిఆర్ సంస్థ గుర్తించిందని కేంద్ర కమిటీ సభ్యుడు భూక్య చరణ్ కాంత్ తెలిపారు. త్వరలో జిల్లా, రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వ శాఖలకు , కోర్టులకు రిపోర్టులు సమర్పిస్తామని సిసిఆర్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ రికార్డుల తనిఖీల విభాగం కేంద్ర కమిటీ సభ్యులు నేవూరి రత్నాకర్, గుండ్ల శివచంద్రం, రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య చంద్రకాంత్, ఎస్.భరద్వాజ్, జోనల్ సెక్రటరీ తాళ్ల సురేష్, రవీందర్, రాము, ఆకుల సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి వేడుకలు




**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** భారత దేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి వేడుకలను మంగళవారం బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ చేసిన గణనీయమైన సేవలను కొనియాడారు. ఐటి, గ్రామీణ అభివృద్ధి, మహిళలకు రిజర్వేషన్, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు, భారీ ప్రాజెక్టుల నిర్మాణం, టెక్నాలజీ రంగం విస్తరణ లాంటి ఆయన చేపట్టిన అంశాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, మల్లారపు చినరాజం (ఎస్సి సెల్ స్టేట్ కన్వీనర్) న్యాతరి స్వామి (స్టేట్ కాంపిన్ కమిటీ సెక్రటరీ), రొడ్డ శారద (రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పాల్గొన్నారు.

# మద్యానికి బానిసై వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండల కేంద్రంలో ని లోనవెల్లి గ్రామానికి చెందిన ధర్మరాజుల గోపాల్ అనే వ్యక్తి మద్యానికి బానిసై మంగళవారం రోజున ఇంట్లో తాడుతో మెడకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ధర్మరాజుల నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం తన కుమారునికి మూడు సంవత్సరాల క్రితం అనిత అనే మహిళతో వివాహం జరిగిందని, ఒక సంవత్సరం కుమార్తె ఉందని తెలిపారు. తన కుమారుడు మద్యానికి బానిసై ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చేవాడని తరుచు ఇంట్లో గొడవ పడుతూ చచ్చిపోతాను బెదిరింపులకు పాల్పడుతూ ఉండే వాడని, రోజులాగే మంగళవారం ఉదయం కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చి చచ్చిపోతాను అంటూ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని తాడుతో మెడకు ఉరి వేసుకుని చనిపోయాడని తెలిపాడు. తన కుమారుని మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని అన్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి కొండ రమేష్ తెలిపారు.

# ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** పెంచికల్‌పేట్ మండలం లోని లోడుపల్లి గ్రామపంచాయతీకి చెందిన బూరషా రమ్య గత రెండు రోజుల క్రితం పాముకాటుతో గురైంది. పాముకాటుకు గురైన రమ్యని మంచిర్యాల లోని మెడి లైఫ్ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న మండల ఎంపిపి జాజిమొగ్గ సుజాత శ్రీనివాస్ రమ్య వైద్య ఖర్చుల నిమిత్తం వారి కుటుంబానికి రూ. 5000 అందజేసి వారి కుటుంబాన్ని పరామర్శించారు.

